క్లుప్తంగా

డీఈవో కమలకుమారికి పదోన్నతి



రాయవరం: జిల్లా విద్యాశాఖాధికారిగా విధులు నిర్వర్తిస్తున్న ఎం.కమలకుమారి డిప్యూటీ డైరెక్టరుగా పదోన్నతి పొందారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి శుక్రవారం ఉత్తర్వులు విడుదలయ్యాయి. అసిస్టెంట్ డైరెక్టర్‌గా హోదాలో కమలకుమారి అమలాపురం ఉప విద్యాశాఖాధికారిగా పని చేస్తూ డీఈవోగా ఎఫ్ఏసీ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి పొందిన కమలకుమారిని పశ్చిమగోదావరి జిల్లా దూబచర్ల డైట్ ప్రిన్సిపాల్‌గా నియమించారు. అయితే అదే సమయంలో కమలకుమారిని కోనసీమ జిల్లా డీఈవోగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. డిప్యూటీ డైరెక్టరు హోదాలో కమలకుమారి కోనసీమ జిల్లా డీఈవోగా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. డీడీగా పదోన్నతి పొందిన కమలకుమారిని పలువురు అభినందించారు.

నేడు కోరుమిల్లిలో 'గడప గడపకూ' పర్యటన

కపిలేశ్వరపురం: కోరుమిల్లిలో శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పర్యటించనున్నట్లు ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు శుక్రవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ఇంటింటికి పర్యటించి సమస్యలను తెలుసుకుంటారన్నారు.

నేడు కోదండ రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠ

కె.గంగవరం: మండలంలోని కుందూరు శివారు తాడిగొయ్యిలో నూతనంగా నిర్మించిన కోదండ రామాలయంతో పాటు విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11.54 నిమిషాలకు విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుందన్నారు. విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా గత రెండు రోజుల నుంచి ఆలయం వద్ద ప్రతిష్ఠా మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, రామచంద్రపురం వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ హాజరు అవుతారని కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

రైతు వ్యతిరేక విధానాలను మానుకోవాలి



కె.గంగవరంలో ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

కె.గంగవరం: రైతు వ్యతిరేక విధానాలను మోదీ ప్రభుత్వం మానుకోవాలని ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు వెంటపల్లి భీమశంకర్, పీడీఎస్‌యు మాజీ రాష్ట్ర అధ్యక్షుడు యు.గనిరాజు డిమాండ్ చేశారు. కె.గంగవరం బస్టాండ్ సెంటర్ వద్ద శుక్రవారం ఖనౌరిలో రైతులపై పోలీసుల కాల్పులను నిరసిస్తూ ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ రెండో దఫా అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం తెచ్చిన మూడు వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలన్నారు. రైతులు ఛలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తుంటే వారిని ఢిల్లీకి రాకుండా జాతీయ రహదారులను బారికేడ్లతో, సిమెంట్ దిమ్మలతో, మేకులు పాతి అడ్డుకోవడం దారుణమన్నారు. గత పదిరోజులు ఆ రైతులపై పాశవికంగా టియర్ గ్యాస్, రబ్బరు బుల్లెట్లు, వాటర్ క్యాన్లతో యుద్ధవాతావరణం సృష్టించడం మంచిది కాదన్నారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం రైతులతో చర్చించి వారి న్యాయపరమైన డిమాండ్లు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బి.సిద్ధూ, నాయకులు సీహెచ్ రాజారెడ్డి, జనిపల్లి వరప్రసాద్, కాశి లెనిన్‌బాబు, చెల్లే లక్ష్మి, పాము పుష్ప తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రంగనాయకులమ్మ జయంతి



వేగాయమ్మపేటలో రంగనాయకమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని వేగాయమ్మపేటలో హిందూ మహాలక్ష్మమ్మ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పాఠశాల వ్యవస్థాపకురాలు వాడ్రేవు రంగనాయకులమ్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలోని ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని విజయనిర్మల మాట్లాడుతూ రంగనాయకమ్మ సేవలను కొనియాడారు. విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో రంగనాయకమ్మ మునిమనవడు వాడ్రేవు సుందర రత్నాకరరావు, వాడ్రేవు లక్ష్మీనృసింహశ్రీధరరావు, సర్పంచ్ అంబటి తుకారం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పథకాల అమలుకు అర్హతే ప్రామాణికం



దుగ్గుదుర్రులో కార్యకర్తలు, ప్రజలకు సీఎం జగనన్న పథకాలను వివరిస్తున్న ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్

రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్

కాజులూరు: జగనన్న పాలనలో సంక్షేమ పథకాల అమలుకు అర్హతే ప్రామాణికమని రాజ్యసభ సభ్యులు (ఎంపీ) పిల్లి సుభాష్‌చంద్రబోస్ అన్నారు. శుక్రవారం మండలంలోని దుగ్గుదుర్రు, గొల్లపాలెం తదితర గ్రామాల్లో ఎంపీ బోస్ పర్యటించి నాయకులు, కార్యకర్తలను కలుసుకున్నారు. పేద మహిళలు, వృద్ధులను ఆప్యాయంగా పలకరించి ప్రభుత్వ పథకాలు వారికి సక్రమంగా అందుతున్నది లేనిది ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ గత టీడీపీ హయాంలో పాతుకుపోయిన దళారీ వ్యవస్థకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చెల్లుచీటీ పలికారన్నారు. గత పాలనలో అరకొరగా వచ్చే ప్రభుత్వ పథకాలు సైతం జన్మభూమి కమిటీ సిఫారసుల మేరకు టీడీపీ కార్యకర్తలకే ఇచ్చేవారన్నారు. సామాన్యులకు న్యాయం జరగాలంటే దళారుల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. అయితే జగనన్న ప్రజాసంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాలన్నీ పారదర్శకంగా అమలు చేస్తున్నారని పార్టీలు, వర్గ విభేదాలకు తావివ్వకుండా వలంటీర్ల ద్వారా అర్హులైన లబ్ధిదారులందరికీ నేరుగా అందిస్తున్నారన్నారు. పలు స్థానిక సమస్యలను ప్రజలు ఎంపీ బోస్ దృష్టికి తీసుకురాగా వాటిపై ఆరా తీసి పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవలసిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందుతున్నదీ లేనిదీ ఆరా తీశారు. సంక్షేమ పథకాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న లబ్ధిని అందరికి వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ మాత భారతి, పీఏసీఎస్ చైర్మన్లు రేమళ్ళ చిట్టియ్యదొర, పితాని సుబ్రహ్మణ్యం, మాజీ సర్పంచ్ పెంకే భీమన్న, మాజీ ఎంపీటీసీ మాత నూకరావు, మండల బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పెంకే విశ్వేశ్వరరావు, పోతు శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేతలను కలసిన సింహాచలం



నక్కా సింహాచలాన్ని అభినందిస్తున్న ఎంపీపీ వెంకటరమణ, వైఎస్సార్ సీపీ నాయకులు

రాయవరం: మండపేట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన కపిలేశ్వరపురం మండల వైఎస్సార్ సీపీ నేత నక్కా సింహాచలం శుక్రవారం రాయవరం మండల వైఎస్సార్ సీపీ నాయకులను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా సింహాచలాన్ని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ప్రకటించిన నేపథ్యంలో వైఎస్సార్ సీపీ సేవాదళ్ మండల శాఖ అధ్యక్షుడు వెలగల సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో జెడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, రాయవరం సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ తేతల సుబ్బరామారెడ్డి, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొవ్వూరి త్రినాథరెడ్డి, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సత్తి వెంకటరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు పోలిమాటి సుధాకర్, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు తమలంపూడి గంగాధర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు మంతెన అచ్యుతరామరాజు, కొల్లి రాంబాబు, గేలం సుబ్బారాయుడు తదితరులను సింహాచలం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

భీమేశ్వరస్వామి రథోత్సవంలో ఆస్థాన పూజ



వేగాయమ్మపేటలో ఆస్థాన పూజ నిర్వహిస్తున్న ఈఓ తారకేశ్వరరావు, జమీందారు సుందర రత్నాకరరావు

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన రథోత్సవం వేగాయమ్మపేటకు చేరుకున్న సందర్భంగా సాయంత్రం వేగాయమ్మపేటలో ఆస్థాన మండపం వద్ద ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు ఆధ్వర్యంలో వాడ్రేవు జమిందార్ల వంశస్తుడు రాజా వాడ్రేవు సుందర రత్నాకరరావు చేతుల మీదుగా ఆస్థాన పూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నీరాజన మంత్ర పుష్పంతో ఆస్థాన పూజ ముగిసింది. ఆలయ అర్చకులు, వేద స్వస్తి వాచకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు ప్రసాదం అందజేశారు. రాత్రి రథం వద్ద సంగీత కచేరి నిర్వహించారు. రథోత్సవం పురస్కరించుకుని రామచంద్రపురం డీఎస్పీ బి.రామకృష్ణ, సీఐ పి.దొరరాజు, ద్రాక్షారామ ఎస్సై జి.సురేంద్రబాబు, రామచంద్రపురం ఎస్సై పి.సురేష్‌బాబు, పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ఏపీఈపీడీసీఎల్ ఏఈ యేసురత్నం ఆధ్వర్యంలో విద్యుత్ సరఫరాను క్రమబద్ధీకరించి విద్యుత్ వైర్లను తొలగించారు. రథోత్సవం ముగిసిన తరువాత తిరిగి పునరుద్ధరించారు.

భీమేశ్వరునికి ఏపీఈడబ్ల్యూడీసీ చైర్మన్ పూజలు



ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో పూజల్లో పాల్గొన్న నాగార్జున యాదవ్

రామచంద్రపురం రూరల్: రాష్ట్ర విద్య, సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ యనమల నాగార్జున యాదవ్ శుక్రవారం ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు, కార్పొరేషన్ డైరెక్టర్, వెలంపాలెం సర్పంచ్ టేకుమూడి సుజాత, సత్యనారాయణ దంపతులు ఘనంగా స్వాగతం పలికారు. ఆలయంలో భీమేశ్వరస్వామి, మాణిక్యాంబా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. నంది మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం అందించారు. ఈఓ స్వామి తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు. అనంతరం ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించి నాడు–నేడులో జరిగిన అభివృద్ధి, పాఠశాలలో మౌలిక వసతులపై సమీక్ష నిర్వహించారు. ఆయన వెంట ఎంపీటీసీ తుమ్మూరి సుబ్బలక్ష్మి, కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.రాధాకృష్ణయ్య, సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఎ.మధుసూదనరావు, అకడమిక్ మానిటరింగ్ అధికారి పి.రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు నురుకుర్తి నాగేశ్వరరావు, నరాల సురేష్, నీల నాగేశ్వరరావు, నాగేంద్ర, విఠల్ మాస్టారు తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట



ప్రజలకు మందుల కిట్‌లు అందిస్తున్న ఎంపీపీ వెంకటరమణ



కోరుమిల్లిలో రోగిని పరీక్షిస్తున్న వైద్యుడు

రాయవరం: సమాజంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంతో ఉండాలని తలంపుతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని అందుకే పేద ప్రజల ఆరోగ్యాన్ని నిత్యం సంరక్షించేలా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని ఎంపీపీ నౌడు వెంకటరమణ అన్నారు. మండలంలోని వెదురుపాకలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రమ్య, చాణక్య ఆసుపత్రి వైద్యులు డాక్టర్ బీఎస్ఎన్ రెడ్డి, డాక్టర్ గోపి రవితేజలు సుమారు 280 మందికి వైద్య సేవలు అందించారు. ఎంపీపీ వెంకటరమణ చేతుల మీదుగా మందుల కిట్ అందజేశారు.

373 మందికి వైద్య సేవలు

కపిలేశ్వరపురం: మండలంలోని వాకతిప్ప పీహెచ్‌సీ పరిధిలోని కోరుమిల్లి–2 సచివాలయం వద్ద శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యాధికారి పి.చంద్రమౌళి, వైద్యులు చిట్టూరి రాకేష్ చౌదరి రోగులను పరీక్షించి ఉచితంగా మందులను అందజేశారు. 33 మందికి కంటి పరీక్షలు చేశారు. కోరుమిల్లి, చిన కోరుమిల్లి గ్రామాలకు చెందిన గ్రామస్తులు శిబిరంలో వైద్య సేవలను పొందారు.

26న సైన్స్ సంబరాలు

మలికిపురం: ఈ నెల 26న లక్కవరం ప్రగతి పాఠశాలలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నట్లు క్లబ్ కార్యవర్గం ఒక ప్రకటనలో తెలిపింది. మూడు నుంచి పదో తరగతి విద్యార్థులు తమ తమ నమూనాలను ఈ నెల 24 లోపు పాఠశాలలో నమోదు చేయించుకోవాలని కూడా నిర్వాహకులు తెలిపారు.

మేలు జరిగితేనే ఆశీర్వదించండి

- కోఆర్డినేటర్ సూర్యప్రకాష్
- పట్టణంలో గడప గడపకూ..



ముచ్చుమిల్లి రోడ్డులో గడప గడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్న కో ఆర్డినేటర్ సూర్యప్రకాష్ తదితరులు

రామచంద్రపురం: గత 57 నెలలుగా రాష్ట్రంలో పేదలకు సంక్షేమ పథకాలను తూచ తప్పకుండా అమలు చేసి మేలు జరిగితేనే ఓటు వేయండని చెప్పే దమ్మున్న నాయకుడు సీఎం జగన్‌మోహన్ రెడ్డి అని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త పిల్లి సూర్యప్రకాష్ అన్నారు. పట్టణంలోని 16వ వార్డు ముచ్చిమిల్లి రోడ్డులో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సూర్యప్రకాష్ పాల్గొన్నారు. ప్రతీ ఇంటికి వెళ్లి అయిదేళ్ల కాలంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పరంగా పొందిన లబ్ధిని వివరిస్తూ 2024లో మళ్లీ వైఎస్సార్ సీపీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సంక్షేమ పథకాల అమలు కోసం తిరిగి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం గురించి ప్రజలకు ప్రతి ఇంటికీ వెళ్లి వివరించారు. సూర్యప్రకాష్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పేదల సంక్షేమం కోసం దేశంలో ఏ నాయకుడు చేయని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి పరిపాలనను ప్రజల చెంతకు చేర్చారు. ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా అత్యధికంగా రూ.3 వేలు పింఛన్‌గా ఒకటో తేదీనే ప్రతి ఇంటికీ తెల్లవారుజామునే వలంటీర్లు వెళ్లి అందించే విధంగా వినూత్న ప్రక్రియను సీఎం అమలు చేశారని సూర్యప్రకాష్ అన్నారు. రైతులు ఎటువంటి కష్టం లేకుండా ఆర్బీకేలను ఏర్పాటు చేసి రైతు సంక్షేమం కోసం పలు పథకాలను అమలు చేశారన్నారు. ఇంత సంక్షేమం జరుగుతుంటే ఓర్వలేని ప్రతి పక్షాలు మూకుమ్మడిగా ఎన్నికల్లో వచ్చేందుకు వస్తున్నారని, వారిని తిప్పికొడుతూ వైఎస్సార్ సీపీని అఖండ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. సూర్యప్రకాష్‌కు పూలమాలలు, హారతులతో పెద్ద ఎత్తున మహిళలు స్వాగతం పలికారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ పెంటపాటి దేవి, మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, వైస్ చైర్మన్ కోలమూరి శివాజీ, కౌన్సిలర్లు పోతంశెట్టి శ్యామల, పాలపర్తి శ్వేతపావని, కేతా సుజాత, కేతా శ్రీను, ఎం.సీతారామలక్ష్మి, ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ తొగరు మూర్తి, పట్టణ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం



కోరుమిల్లిలో నమూనా చెక్ అందజేస్తున్న పృథ్వీరాజ్, జెడ్పీటీసీ, ఎంపీపీ

కపిలేశ్వరపురం: రాష్ట్రంలోని ప్రతి పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన మహిళకూ ప్రభుత్వ లబ్ధి అందినట్లు జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, వైఎస్సార్ సీపీ యువనేత తోట పృథ్వీరాజ్ అన్నారు. మండలంలోని వాకతిప్ప, నాగులచెరువు, కోరుమిల్లి, మాచర, టేకి గ్రామాల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు కొరిపెల్ల వెంకట నాగస్రవంతి, వాసంశెట్టి సునీత, కుక్కల నాగమణి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమాల్లో వైఎస్సార్ ఆసరా పథకం లబ్ధిదారులకు నమూనా చెక్‌ను అందజేశారు.

పృథ్వీరాజ్ మాట్లాడుతూ మహిళాభ్యుదయం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే సాధ్యపడుతుందన్నారు. జెడ్పీటీసీ అబ్బు, ఎంపీపీ సత్యవేణి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఉమ్మిడిశెట్టి వీరవేణి, శీలం సూర్యకుమారి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చేస్తున్న కృషికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, మండల సాగునలహా మండలి చైర్మన్ పుట్టా కృష్ణమూర్తి, పీఏసీఎస్ చైర్మన్ పుట్టా జానకిరామయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో సీట్లకు దఖాస్తులకు ఆహ్వానం

కపిలేశ్వరపురం: విద్యాహక్కు చట్టం నియ మ నిబంధనలు మేరకు ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లలో ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఎంఈఓ కె.తాతారావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనారిటీ వర్గాలకు చెందిన చిన్నారులు, అనాథులు, హెచ్ఐవీ బాధితులు, విభిన్న ప్రతిభావంతులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. స్టేట్ సిలబస్, ఐసీఎస్ఈ, సీబీఎస్ఈ, ఐబీ సిలబస్‌లున్న సంస్థల్లో చేరేందుకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 23 నుంచి మార్చి 14 లోపు *http://creapgov.in* వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యార్థులు తమ ఆధార్, ఇతర ధృవపత్రాలను తప్పనిసరిగా జతచేయాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలు కోసం 180042585992 నంబర్‌ను సంప్రదించాలని ఎంఈఓ తాతారావు తెలిపారు.

ఎన్నికల నియమావళిపై అవగాహన అవసరం



మండపేట సమావేశంలో ఎమ్మెల్యే వేగుళ్ల, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు

కపిలేశ్వరపురం (మండపేట): రానున్న సార్వత్రిక ఎన్నికల నియమావళిపై రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులకు అవగాహన అవసరమని నియోకవర్గ ఓటరు నమోదు ఇన్‌చార్జి అధికారి, మండపేట తహసీల్దార్ ఎం.సురేష్ అన్నారు. తన కార్యాలయంలో శుక్రవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ ప్రతినిధి యరమాటి వెంకన్నబాబు, ఇతర పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు. స్పెషల్ సమ్మరీ రివిజన్–2024కి సంబంధించి గత వారం రోజులుగా అందిన దరఖాస్తుల వివరాలను వెల్లడించారు. సమావేశంలో మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం రెవెన్యూ అధికారులు హాజరయ్యారు.

రోడ్డు ప్రమాదంలో స్కూటరిస్టుకు గాయాలు

కాజులూరు: మండలంలోని గొల్లపాలెం, యానం రహదారిలో బందనపూడి ఊటచెరువు సెంటర్ వద్ద శుక్రవారం ఒక స్కూటరిస్టు అదుపుతప్పి తీవ్ర గాయాల పాలయ్యాడు. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కాకినాడకు చెందిన చిట్టిబాల ధనరాజు తన స్కూటర్‌పై కాజులూరు వచ్చి తిరిగి వెళుతున్నాడు. బందనపూడి శివారు ఊటచెరువు సెంటర్ వద్దకు వచ్చేసరికి స్కూటరు అదుపుతప్పి రోడ్డుపక్కన ఉన్న గోతిలో పడ్డాడు. ఈ సంఘటనలో ధనరాజు గాయాల పాలవగా స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం గొల్లపాలెంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు.

ఉరేసుకొని ఉద్యోగి ఆత్మహత్య

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రేమ విఫలం కావడంతో టీసీఎస్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదిభట్ల సీఐ రాఘవేంద్రరెడ్డి కథనం ప్రకారం.. మండపేట మండలం వేములపల్లికి చెందిన సత్తి నాగ చంద్రప్రకాశ్ (24) హైదరాబాద్‌లోని ఆదిభట్ల ప్రాంతంలో 2021 నుంచి టీసీఎస్‌లో సిస్టమ్ ఇంజినీర్‌గా ఉద్యోగం చేస్తూ స్థానిక హాస్టల్‌లో ఉంటున్నాడు. తోటి మహిళా ఉద్యోగితో స్నేహంగా మెలిగేవాడు. ఈక్రమంలో ఆమెకు లవ్ ప్రపోజ్ చేశాడు. సదరు యువతి ఇందుకు అంగీకరించకపోవడంతో మనస్థాపానికి గురై శుక్రవారం హాస్టల్ గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బీచ్‌లో జల్లు స్నానానికి విస్తృత ఏర్పాట్లు

సఖినేటిపల్లి: అంతర్వేది బీచ్‌లో పౌర్ణమి స్నానాలు పురస్కరించుకుని ఒడ్డున భక్తుల కోసం దేవస్థానం జల్లు స్నానానికి విస్తృత ఏర్పాట్లు శుక్రవారం పూర్తి చేసింది. శనివారం సముద్రంలో సుదర్శన చక్రధారుడైన స్వామివారితో పాటు స్నానం చేయలేని భక్తులకు జల్లు స్నానం ద్వారా స్వామి కరుణ, కటాక్షాలు కలుగజేసేందుకు ఈ ఏర్పాట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ చేశారు. ఇందుకు ఒడ్డున సర్వే బాదులతో ప్రత్యేక లైను ఏర్పాటు చేసి, మధ్యలో అరప కట్టారు. అరపపై సుదర్శన చక్రధారుడైన లక్ష్మీనృసింహుని విగ్రహాన్ని ఆశీనులు చేసి, విగ్రహంపై నుంచి ప్రత్యేక పైపు మార్గం ద్వారా సముద్ర జలాలు జారవిడుస్తారు. అరప కింద భాగంలో క్యూ లైన్‌లో భక్తులు వెళ్లే క్రమంలో అరప పై నుంచి స్వామి విగ్రహం మీదుగా జారవిడిచే జలాలు భక్తుల శిరస్సులపై పడతాయి. కాగా చివరి సారిగా ఈ ఏర్పాట్లు 2019 ఉత్సవాల్లో చేశారు. నాలుగేళ్ల విరామం అనంతరం ఈ ఏడాది జల్లు స్నానంకు అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ తీసుకున్న చొరవతో పునరుద్ధరించారు. ఆలయ సూపరింటెండెంట్ పి.విజయసారథి పాల్గొన్నారు.